# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ దేశ సమగ్ర స్థిరమైన అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

❖ భారత్ - మారిషస్ దేశాలు 8 కీలక రంగాలకు సంబంధించి అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

❖ మారిషస్ దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని అధ్యక్షుడు ధరమ్ గోఖూల్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రదానం చేశారు.

❖ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ బిల్లు 2024కు ఈరోజు లోక్ సభ ఆమోదం తెలిపింది.

==========================

దేశ సమగ్ర స్థిరమైన అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయం 72వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వికసిత్ భారత్ లక్ష్య సాధనలో విశ్వ విద్యాలయాలు ఆవిష్కరణ, పరిశోధనలను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. మహిళలు ప్రతి రంగంలోనూ రాణిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయం సాధించిన విజయాలను రాష్ట్రపతి ప్రశంసించారు.

(వాయిస్ 40 సెకన్లు)

==========================

భారతదేశానికి మారిషస్ కీలక భాగస్వామి అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మారిషస్ పర్యటనలో భాగంగా ఆదేశ ప్రధానమంత్రి నవీన్ రామ్‌గూలంతో నరేంద్ర మోడీ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ఇరు

దేశాలు కరెన్సీ పరిష్కార వ్యవస్థ, క్రెడిట్ సౌకర్య ఒప్పందం, ఆర్థిక నేరాలను ఎదుర్కోవడనికి సమాచారాన్ని పంచుకోవడం, MSME రంగంలో సహకారం, సుపరిపాలన కోసం ప్రభుత్వ అధికారులకు శిక్షణ వంటి 8 అవగాహన ఒప్పందాలను చేసుకున్నాయి. అనంతరం పాత్రికేయుల సమావేశంలో నరేంద్రమోదీ మాట్లాడుతూ... రెండు దేశాల బంధాన్ని 'మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్య హోదాకు తీసుకెళ్లాలని ఇరు దేశాల ప్రధానులు నిర్ణయించారని తెలిపారు. మారిషస్‌లో కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి భారత్ సహకరించనుందని, ప్రజాస్వామ్యానికి తల్లి వంటి భారత్ నుంచి మారిషస్‌కు ఇదొక కానుకగా భావిస్తున్నాం అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వాణిజ్యం, పరస్పర భద్రత అంశాలపై ఇరు దేశాలు కలసి పనిచేస్తాయని వివరిస్తూ..

(వాయిస్ 37 సెకన్లు)

==========================

దేశంలో సుమారు లక్షా 65 వేల పోస్ట్ ఆఫీసులు సేవలను అందిస్తున్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వీటిలో దాదాపు 16 వేల పోస్టాఫీసులు పట్టణ ప్రాంతాల్లో, లక్షా 49 వేలకు పైగా పోస్టాఫీసులు గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్నాయని వెల్లడించారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధాన మిస్తూ..... దేశంలోని అన్ని విభాగ పోస్టాఫీసులను కంప్యూటరీకరించామని అన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ కింద పోస్టాఫీసులు బ్యాంకింగ్, ఇతర డిజిటల్ సేవలను అందించేలా వీలు కల్పించామని కేంద్రమంత్రి వివరించారు.

==========================

పాకిస్థాన్ లో పెషావర్ రైలు హైజాక్ ఘటనలో ఇప్పటివరకు 150 మంది ప్రయాణికులను రక్షించినట్లు పాకిస్తాన్ భద్రతా దళాలు వెల్లడించాయియి. రక్షించబడిన ప్రయాణికులను సమీప పట్టణం మాక్‌కు తరలించి వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 27 మంది మిలిటెంట్లను హతమార్చినట్లు ప్రకటించారు. బలూచిస్తాన్‌లోని కచ్చి జిల్లాలో 400 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న రైలును బలూచ్ లిబరేషన్ ఆర్మీ (BLA) ఉగ్రవాదులు నిన్న హైజాక్ చేసిన సంగతి తెలిసిందే.

విరామం

==========================

పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆయిల్ ఫీల్డ్స్ (నియంత్రణ, అభివృద్ధి) 2024 సవరణ బిల్లుకు ఈరోజు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఆయిల్ ఫీల్డ్స్ చట్టం, 1948ని సవరించడానికి ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఇది సహజంగా లభించే హైడ్రోకార్బన్, కోల్ బెడ్ మీథేన్, షేల్ గ్యాస్ వంటి ఖనిజ నూనెల నిర్వచనాన్ని వివరిస్తుంది. బొగ్గు, లిగ్నైట్ లేదా హీలియం ఖనిజ నూనెలలో చేర్చబడవని ఈ బిల్లు స్పష్టం చేస్తుంది. బిల్లుపై చర్చకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి సమాధానమిస్తూ... ఇంధన భద్రత కోసం స్థోమత, లభ్యత, స్థిరత్వం అనే మూడు అంశాలను భారతదేశం విజయవంతంగా అధిగమించిందన్నారు. ప్రస్తుతం భారతదేశం 40 దేశాల నుండి దిగుమతులను చేపడుతోందని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================

మారిషస్‌లోని చాంప్ డి మార్స్‌లో ఈరోజు జరిగిన మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 140 కోట్ల మంది భారతీయుల తరఫున మారిషస్ ప్రజలకు జాతీయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో భాగంగా మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోఖూల్

భారత్ - మారిషస్ భాగస్వామ్యానికి నరేంద్రమోదీ చేసిన కృషికి గాను మారిషస్ అత్యున్నత పౌర పురస్కారమైన కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్ అవార్డును ప్రదానం చేశారు. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్న మొదటి భారతీయుడిగా ప్రధానమంత్రి మోదీ నిలిచారు. మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకల కవాతులో పాల్గొన్న భారత నావికా దళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

==========================

చారిత్రాత్మక దండి మార్చ్‌లో పాల్గొన్న వారందరికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు నివాళులర్పించారు. మహాత్మా గాంధీ నేతృత్వంలోని దండి మార్చ్ స్వావలంబన స్వాతంత్ర్యం కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రేరేపించిందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. దండి మార్చ్‌లో పాల్గొన్న వారి ధైర్యం, త్యాగం, సత్యం, అహింస వాటి పట్ల వారి నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని.. ప్రధానమంత్రి అన్నారు.

==========================

అమెరికా ప్రతిపాదనల మేరకు 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ మద్దతు తెలిపింది. నిన్న సౌదీ అరేబియాలోని జెడ్డాలో జరిగిన చర్చల అనంతరం రష్యాతో తక్షణ చర్చలకు అంగీకరించింది. ఈ ప్రతిపాదనలో కాల్పుల విరమణపై సుమారు నెల రోజుల విరామం ఉండాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలను రష్యాకు తీసుకు వెళ్లనున్నట్లు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో విలేకరులకు తెలియజేశారు. అలాగే ఉక్రెయిన్‌తో సైనిక సహాయం, నిఘా భాగస్వామ్యాన్ని అమెరికా తిరిగి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

==========================

భారతదేశంలోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన చర్యలు తీసుకుంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. రాజ్యసభలో ఆయన లిఖితపూర్వక సమాధానమిస్తూ.. బంగ్లాదేశ్ సరిహద్దులో భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన 2 వేల 601 మంది బంగ్లాదేశీయులను భారత బలగాలు అదుపులోకి తీసుకున్నాయని తెలిపారు. ఇరు దేశాల సరిహద్దు ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడానికి అధునాతన నిఘా, సాంకేతిక వ్యవస్థ, సమగ్ర ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటివి వినియోగిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా నిరంతర పెట్రోలింగ్, చొరబాటుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఫ్లడ్‌లైట్లు, సోలార్ లైట్లు ఏర్పాటు, నదీ ప్రాంతాల్లో నిరంతరం పడవలతో పహారా చేపడుతున్నామన్నారు. బీఎస్ఎఫ్ (BSF) నేతృత్వంలోని 15 మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తున్నాయని నిత్యానంద్ రాయ్ వెల్లడించారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ఈరోజు ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74 వేల 102 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరికి 73 పాయింట్ల నష్టంతో 74 వేల 029 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.40 పాయింట్లు కోల్పోయి 22 వేల 470 వద్ద స్థిరపడింది.

==========================
==========================